ఈరోజు (26 సెప్టెంబర్) విజయవాడ యం.బి.విజ్ఞానకేంద్రంలో వామపక్ష పార్టీల విలేకర్ల సమావేశం జరిగింది. ఆ వివరాలను ప్రచురణార్థం/ప్రసారార్థం కొరకు మీకు పంపిస్తున్నాము.

– జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

# 29, 30, 1న
# అసెంబ్లీ నియోజకవర్గాల్లో దీక్షా నిరసనలు
# – రైతాంగానికి వామపక్షాలు పిలుపు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ, రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ కలెక్టర్ కార్యాలయాల ముట్టడికి కొనసాగింపుగా 29, 30, 1న రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దీక్షా నిరసనలు చేపట్టాలని, దీనికి రైతాంగమంతా కదిలి రావాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. స్థానిక ఎంబి విజ్ఞాన కేంద్రంతో వామపక్షాల రాష్ట్ర నాయకులు శనివారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం కార్యాచరణను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మీడియాకు వెల్లడించారు. దీక్షా నిరసనల్లో కేవలం వామపక్షాలు మాత్రమే కాదని, పలు రైతాంగ పోరాట సంఘాలు, రైతు నాయకులు, రైతులు భాగస్వామ్యమవుతారని తెలిపారు. ఇప్పటికే రైతాంగ పోరాట నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్నేని నాగేంద్రనాథ్, చుండూరు రంగారావు వంటి ప్రముఖులు దీక్షా నిరసనలకు కలిసి వస్తామని చెప్పారని వివరించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లోని రైతాంగమంతటిని సంప్రదించి, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ, రైతాంగ వ్యతిరేక బిల్లులకు వ్యతిరేకంగా మద్దతు కూడగడతామన్నారు. దీక్షా నిరసనల నిర్వహణపై 27, 28న అవగాహన కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం ఈ మూడు బిల్లులను వెనక్కు తీసుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు. వైసిపి, టిడిపి, జనసేన మతోన్మాదాన్ని రెచ్చగొట్టే బిజెపికి రాష్ట్రంలో బలం చేకూర్చుతున్నాయన్నారు. రైతు అనుకూల పార్టీలని చెప్పుకునే వైసిపి, టిడిపిలు రైతాంగం నడ్డి విరిచేందుకు, కేంద్రం తెచ్చిన బిల్లులకు సిగ్గులేకుండా మద్దతునిచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్వేది ఘటనతో బిజెపి రాష్ట్రంలో మత కల్లోలం సృష్టిస్తోందని, ఘటన వెనుక ఉన్న నిందితిల వివరాలను సిబిఐ వెల్లడించాలని డిమాండ్ చేశారు. కరోనాతో ప్రజలు అల్లాడుతున్నారని, వైద్యులు సరిపడా లేరని, సకాలంలో ప్రజలకు వైద్యం అందక పిట్టల్లా రాలిపోతున్నా వైసిపి, టిడిపి, జనసేనకు పట్టడంలేదని విమర్శించారు.మత విద్వేషాలు రెచ్చగొట్టే బిజెపికి మద్దతు తెలుపుతున్నారని మండిపడ్డారు. ఇళ్లు తగులబెట్టి, బగ్గులు ఏరుకోవాలని బిజెపి చూస్తోందని, రైతులు, ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్తారని వ్యాఖ్యానించారు. దీక్షా నిరసనలను రైతులు, ప్రజలు, రైతు మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ అజెండాను అమలు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని అన్నారు. చివరకు వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలని చూస్తోందని తెలిపారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో రైతాంగం పెద్దఎత్తున నిరసనలు చేపడుతోందని, రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. వ్యవసాయ బిల్లులు మూడింటిని కేంద్రం ఉపసంహరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు బిగిస్తే, అక్కడి నుండే జగన్ రాజకీయ పతనం ప్రారంభమవుతుందనే విషయాన్ని గ్రహించాలని హెచ్చరించారు. టిడిపికి జగన్‌ను దెబ్బకొట్టాలనే తపనే తప్ప, రైతాంగ వ్యతిరేక చట్టాలు చేస్తున్న బిజెపి వైఖరి కనబడడంలేదని విమర్శించారు. సమావేశంలో వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు(సిపిఎం), ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్(సిపిఐ), పి.ప్రసాద్, పోలారి(సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), పి.వి.సుందరరామరాజు(ఫార్వర్డ్‌బ్లాక్), హరినాథ్, ఎం ఈశ్వర్(సిపిఐ ఎంఎల్ లిబరేషన్), ఖాదర్‌బాషా, ఎస్‌కె ఎజాజ్ (ఎంసిపిఐ యు), సుధీర్(ఎస్‌యుసిఐ సి) పాల్గొన్నారు.

= = = =